క్లుప్తంగా

రేపు పీజీఆర్ఎస్ రద్దు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ మేయర్ ఎన్నికకు ఎన్నికల సంఘం ఇచ్చిన నోటిఫికేషన్ దృష్ట్యా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్, డయల్ యువర్ కమిషనర్) కార్యక్రమాలను రద్దు చేసినట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగర పాలక సంస్థ కాల్ సెంటర్ 0863-2345103 ఫిర్యాదు చేయవచ్చునన్నారు.

నేడు పనిచేయనున్న క్యాష్ కౌంటర్లు

నెహ్రూనగర్: పన్ను చెల్లింపుదారుల సౌలభ్యం కోసం ఆదివారం నగర పాలక సంస్థ క్యాష్ కౌంటర్లు పనిచేస్తాయని కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నును ముందస్తుగా ఏప్రిల్ నెలాఖరులోగా ఏక మొత్తంగా చెల్లించే వారికి మొత్తం పన్నుపై 5 శాతం రాయితీ ఇస్తున్న విషయం తెలిసిందే. అదే విధంగా ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను బకాయిలను ఏక మొత్తంగా చెల్లిస్తే వారికి వడ్డీపై 50 శాతం రాయితీ పొందేందుకు మరో 4 రోజులే గడువు ఉందని చెప్పారు. చెల్లింపుల కోసం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో 8, సర్కిల్ కార్యాలయంలోని 6 ట్యాక్స్ కలెక్షన్ కౌంటర్లు ఉదయం 7 నుంచి రాత్రి 8 గంటల వరకు పని చేసేలా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు.

30న జాబ్ మేళాపై అవగాహన సదస్సు

నెహ్రూనగర్: స్మార్ట్ టెక్స్, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మే 15వ తేదీలోపు నిర్వహించనున్న గుంటూరు మెగా జాబ్ మేళాకు సంబంధించి ఈ నెల 30 స్థానిక శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఉదయం నిర్వహించనున్న వర్క్ షాప్‌కు రిజిస్ట్రేషన్ చేసుకున్న నిరుద్యోగ యువత తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. జిల్లాలో 10వ తరగతి ఆపైన చదివిన నిరుద్యోగ యువతకు వారి అర్హతకు తగిన విధంగా ఉండేలా సుమారు 50 కంపెనీల నుంచి ఉద్యోగాలు అందించేలా బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించనున్నామన్నారు. ఐటీ, నాన్ ఐటీ , బ్యాంకింగ్, ఫార్మసీ, నర్సింగ్ రంగాల్లోని వివిధ కంపెనీలు నిర్వహించే ఉద్యోగాల కల్పనకు వార్డ్ సచివాలయంలో క్యూఆర్ కోడ్, సచివాలయ ఎడ్యుకేషన్-డేటా ప్రాసెసింగ్ సెక్రెటరీ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

ముగిసిన సీజనల్ హాస్టల్


కొరిటిపాడు(గుంటూరు): సమగ్ర శిక్ష, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాల మేరకు బిహార్ నుంచి వచ్చిన వలస కార్మికుల పిల్లల కోసం గుంటూరు మిర్చి యార్డు సమీపంలో ఏర్పాటు చేసిన సీజనల్ హాస్టల్(ప్రత్యేక పాఠశాల) శుక్రవారంతో ముగిసింది. వెన్నెల సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హాస్టల్‌లో చాలా మంది చిన్నారులు లబ్ధిపొందినట్లు ప్రెసిడెంట్ లీలా మస్తాన్ చెప్పారు.

డీపీఆర్సీ భవన నిర్మాణ పనులు పరిశీలన



గుంటూరు ఎడ్యుకేషన్: జెడ్పీ ప్రాంగణంలో నిర్మాణంలో డీపీఆర్సీ భవన పనులను జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా శనివారం పరిశీలించారు. రూ.రెండు కోట్ల ప్రభుత్వ నిధులతో చేపట్టిన డీపీఆర్సీ భవన నిర్మాణ పనులను పూర్తి నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని అధికారులకు సూచించారు. పంచాయతీరాజ్‌కు సంబంధించిన కార్యకలాపాల నిర్వహణకు ఈ భవనం ఉపయోగపడుతుందని తెలిపారు. ఆమె వెంట డీఈ భానుప్రసాద్, ఓఎస్డీ శివన్నారాయణ ఉన్నారు.

అధ్యాపకులకు అవగాహన సదస్సు



గుంటూరు రూరల్: మండలంలోని గోరంట్ల గ్రామంలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో ఐదు రోజులుగా జరుగుతున్న ఐసీటీ టూల్స్‌పై అధ్యాపకుల శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య మాట్లాడుతూ విద్యార్థులకు సులభతరమైన పద్ధతిలో, అర్థవంతంగా విద్యాబోధన చేసేందుకు ఇలాంటి శిక్షణ తరగతులు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా డేటా వ్యాలీ సంస్థ ప్రతినిధులు టి. ప్రమోద్, ఎ. చక్రవర్తిలు అడ్వాన్స్ ఎక్సెల్‌పై అధ్యాపకులకు అవగాహన కల్పించారు. అనంతరం సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

వేసవిలో విజ్ఞానం... వినోదం

- చదువుల ఒత్తిడి నుంచి విద్యార్థులకు ఉపశమనం
- క్రీడలు, ఆటలతో పాటు సృజనాత్మకతకు పదును
- నగరంలోని వివిధ పాఠశాలల్లో కొనసాగుతున్న సమ్మర్ క్యాంపులు
- ఉత్సాహంగా పాల్గొంటున్న విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏడాది పొడవునా పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు వేసవి సెలవులు ఇవ్వడంతో సేదతీరుతున్నారు. పుస్తకాలకు దూరంగా ఆట, పాటలతో సరదాగా గడుపుతున్నారు. ఏడాది పొడవునా చదువుల పేరుతో పోటీపడుతూ విసుగెత్తిపోయిన విద్యార్థులకు ఆటవిడుపు అందించేందుకు నగరంలోని వివిధ పాఠశాలలు వేసవి శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేశాయి. విద్యార్థుల్లో సృజనాత్మక నైపుణ్యాలను వెలికితీసేందుకు వినూత్నమైన శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. చిత్రలేఖనం, పెయింటింగ్, వ్యర్థాలతో అందమైన వస్తువుల తయారీ, స్కేటింగ్, చెస్, నృత్యం, సంగీతం, యోగా, తోలుబొమ్మలాట, అష్టాచెమ్మా, ఏడు పెంకులాట వంటి ప్రాచీన క్రీడలు, ఆటల ద్వారా విద్యార్థుల్లో ఉత్సాహాన్ని కలిగిస్తున్నారు. విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా క్రీడలతో పాటు ఆటలు, సృజనాత్మక నైపుణ్యాలకు పదునుపెట్టే ఆర్ట్, క్రాఫ్ట్, సంగీతం, యోగా వంటి అంశాల్లో శిక్షణ పొందే సదుపాయాన్ని కల్పిస్తున్నారు. సెల్‌ఫోన్లు, టీవీలకు దూరంగా ఆహ్లాదకరమైన వాతావరణంలో వేసవి శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. వేసవి శిక్షణా శిబిరాల ద్వారా విద్యార్థులకు కల్పిస్తున్న శిక్షణా కార్యక్రమాలు, వాటి ద్వారా విద్యార్థులకు కలిగే ప్రయోజనాలను శిక్షకులు ఈ విధంగా వివరిస్తున్నారు.



తయారు చేసిన బొమ్మలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



తయారీలో శిక్షణ పొందుతున్న చిన్నారులు



సరదా ఆటలు ఆడుతున్న విద్యార్థినులు

ప్రాణాయామంతో క్రమశిక్షణ



యోగా, ప్రాణాయామం ద్వారా సంపూర్ణమైన ఆరోగ్యాన్ని పొందవచ్చు. యోగా ప్రాణాయామాన్ని సాధన చేయడం ద్వారా ఆరోగ్యంతో పాటు ఉత్సాహం, జ్ఞాపకశక్తి, ఏకాగ్రత వృద్ధి చెందుతాయి. యోగాతో పాటు క్రీడలు, ఆట, పాటలతో సేదతీరుతున్నారు.

–జె.రమాదేవి, యోగా టీచర్

చిత్రలేఖనంతో విద్యార్థుల్లో ఏకాగ్రత



చిత్రలేఖనంలో శిక్షణ కల్పించడం ద్వారా విద్యార్థుల్లో ఏకాగ్రతను పెంపొందిచవచ్చు. కలర్ పేపర్లతో డెకొరేషన్ వస్తువుల తయారీ శిక్షణపై విద్యార్థులు ఆసక్తి చూపిస్తున్నారు. ఆర్ట్, క్రాఫ్ట్ శిక్షణతో విద్యార్థులకు చదువుపై ఏకాగ్రత, చేపట్టిన పనిపై శ్రద్ధాసక్తులను ప్రేరేపించగలం.

–ఎస్.కమల, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ టీచర్

వ్యర్థాలతో అందమైన కళాకృతులకు రూపం



వ్యర్థాలతో అందమై కళాకృతులతో పాటు గృహాలంకరణ వస్తువుల తయారీలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాం. విద్యార్థుల ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. టీష్యూ పేపర్లు, స్ట్రాలు, కూల్‌డ్రింక్ సీసాల మూతలతో అందమైన వస్తువులను తయారీ చేయించడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మక నైపుణ్యాలను వెలికితీయవచ్చు.

–వి.హేమలత, డ్రాయింగ్ టీచర్

సంగీత, వాయిద్యాలపై శిక్షణతో మేధకు పదును



విద్యార్థుల్లో దాగిన అభిరుచికి అనుగుణంగా కీబోర్డ్, డ్రమ్స్ వాయిద్యాలపై శిక్షణ ఇస్తున్నాం. తద్వారా మేధ అభివృద్ధి చెందుతుంది. భవిష్యత్‌లో సంగీతంపై ఇష్టాన్ని పెంచుకుని ముందుకు వెళ్లేందుకు అవకాశాలు ఏర్పడతాయి. సంగీత సాధన ద్వారా మానసిక ప్రశాంతత చేకూరి, ఒత్తిడి దూరమవుతుంది. చదువుల ఒత్తిడి నుంచి బయటపడేందుకు సంగీత శిక్షణ దోహదం చేస్తుంది.

–ఎస్.రాంబాబు, సంగీత శిక్షకుడు

రోడ్లు, డ్రైయిన్లపై వ్యాపారాలు చేస్తే చర్యలు



టిఫిన్ బండి యజమానితో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో రోడ్లు, డ్రెయిన్లపై వ్యాపారాలు చేసుకుంటూ ట్రాఫిక్‌కి అడ్డంకిగా ఉండే వాటిని తొలగించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, పట్టణ ప్రణాళిక అధికారులు, కార్యదర్శులను ఆదేశించారు. శనివారం నెహ్రూనగర్, రాజీవ్ గాంధీ నగర్, సంజీవయ్య నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య, అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రధాన రోడ్ల పక్కన, డ్రెయిన్లను ఆక్రమించుకొని ట్రాఫిక్‌కి అడ్డంకిగా వ్యాపారాలు చేసుకునే వాటిని తొలగించాలన్నారు. వార్డ్ సచివాలయాల వారీగా ప్రతి కమర్షియల్ సంస్థ తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండేలా శానిటేషన్ కార్యదర్శులు బాధ్యత తీసుకోవాలన్నారు. తమ రోజువారీ పర్యటనలలో ట్రేడ్ లైసెన్స్ లేని కమర్షియల్ సంస్థలను గుర్తిస్తే శానిటేషన్ కార్యదర్శి, ఇన్‌స్పెక్టర్లే బాధ్యత వహించాల్సి వస్తుందని స్పష్టం చేశారు. పర్యటనలో ఎస్ఎస్ ఐజాక్ పాల్గొన్నారు.

సెప్టిక్ వ్యర్థాలను రోడ్ల పక్కన వేస్తే కఠిన చర్యలు

ఎస్ఈ నాగమల్లేశ్వరరావు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో ఎక్కడా సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలను రోడ్ల పక్కన, డ్రెయిన్లలో వేయడానికి వీలు లేదని, అలా వేసే ట్యాంకర్లను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు హెచ్చరించారు. నగరంలోని సెప్టిక్ ట్యాంకర్ల యజమానులు, కాంట్రాక్టర్లతో శనివారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎస్ఈ మాట్లాడుతూ సఫాయి కర్మచారి చట్టం 2013 ప్రకారం సెప్టిక్ ట్యాంకర్ల వద్ద పని చేసే సిబ్బంది తప్పనిసరిగా పీపీఈ కిట్‌లు ధరించే విధులు నిర్వహించాలని కోరారు. జీఓ 134 మేరకు ప్రతి సెప్టిక్ ట్యాంకర్ యజమాని/ కాంట్రాక్టర్ తప్పనిసరిగా స్థానిక సంస్థల్లో రిజిస్టర్ చేసుకొని, తగిన లైసెన్స్ తీసుకొని, నిర్దేశిత ఫీజులు వసూలు చేసుకోవాలన్నారు. నగరంలోని సెప్టిక్ ట్యాంకర్లు తప్పనిసరిగా సుద్ధపల్లి డొంకలోని నగరపాలక సంస్థ ఎఫ్ఎస్టీపీకే వ్యర్థాలను తరలించాలని, అక్కడ శాస్త్రీయ పద్ధతిలో నిర్వహణ చేయడం జరుగుతుందని వివరించారు. నగరపాలక సంస్థ తరఫున ప్రత్యేక రిజిస్ట్రేషన్ చేస్తామని, రిజిస్ట్రేషన్ లేకుండా ఉండే వాహనాలను సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం మాట్లాడుతూ సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలను ఆరుబయట వదలడం ప్రజారోగ్యానికి, పర్యావరణానికి ప్రమాదమన్నారు. వ్యర్థాల్లో ఉండే సూక్ష్మ క్రిములు భూమిలోకి ఇంకడం ద్వారా నీటి కాలుష్యం, గాలిలో కలిసి వాయు కాలుష్యం జరుగుతుందన్నారు. నిర్వహకులు తప్పనిసరిగా నిర్దేశిత విధానంలో వ్యర్థాలను తరలించాలని కోరారు. సమావేశంలో ఈఈ కోటేశ్వరరావు, డీఈఈ నాగ భూషణం, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కన్సల్టెంట్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.



సెప్టిక్ ట్యాంక్ నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎస్ఈ

శివారు కాలనీల గొంతెండుతోంది..

- తాగునీటిని ప్రైవేట్ సంస్థలకు మళ్లిస్తున్న కింది స్థాయి సిబ్బంది
- స్వయంగా తూర్పు ఎమ్మెల్యేకు స్థానికులు ఫిర్యాదు
- స్పష్టంగా కనిపిస్తున్న ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో శివారు కాలనీలకు తాగునీటిని సక్రమంగా అందించడంలో ఇంజినీరింగ్ అధికారులు విఫలమవుతున్నా. తాగునీటి సరఫరాలో వాల్వ్ ఆపరేటర్లు, ట్యాప్ వర్కర్లు, ఫిట్టర్లు కీలకం. అయితే వీరిపై ఏఈల పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతో పంపింగ్ సమయంలో కాసులు ఇచ్చిన వారికి అధికంగా నీళ్లు వదులుతుంటారనే ఆరోపణలు లేకపోలేదు. 10 లక్షలు పైబడిన జనాభా కలిగిన గుంటూరు నగరానికి విజయవాడ(ఉండవల్లి) నుంచి గుంటూరుకు సుమారు 150 ఎంఎల్‌డీ వాటర్ సరఫరా అవుతుంది. వేసవి కాలం కావడంతో అప్పుడప్పుడు ఉత్పన్నమయ్యే విద్యుత్ కోతలతో పంపింగ్ సక్రమంగా జరగకపోవడంతో తాగునీరు నగరానికి అంతంత మాత్రంగా సరఫరా అవుతాయి. వాటినే నగరంలోని అన్ని ప్రాంతాలకు సరఫరా చేస్తుంటారు.



వాల్వ్ ఆపరేటర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్(ఫైల్)

తాగునీటిని ప్రైవేట్ సంస్థకు మళ్లిస్తున్న వైనం

గత కొద్ది రోజుల క్రితం తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ మద్దిరాల కాలనీలో పర్యటించారు. అక్కడ నాలుగు రోజుల నుంచి నీరు రావడంలేదని, ఎన్ని సార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్థానిక వాల్వ్ ఆపరేటర్ తాగునీటిని ప్రైవేట్ సంస్థలకు మళ్లిస్తున్నారనే ఆరోపణలపై ఎమ్మెల్యే, వాల్వ్ ఆపరేటర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఏళ్ల తరబడి పాతుకుపోయిన వాల్వ్ ఆపరేటర్లు

నగరపాలక సంస్థ పరిధిలోని పలు రిజర్వాయర్ల పరిధిలో వాల్వ్ ఆపరేటర్లు, ఫిట్టర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు దశాబ్దాల తరబడి అక్కడే విధులు నిర్వహించడంతో వారు ఆడిందే..ఆట.. పాడిందే పాటగా మారిపోయిందనే చెప్పుకోవచ్చు. వీరే అనధికారికంగా ట్యాపులు ఇచ్చి రూ.25 నుంచి 50 వేల దాకా వసూలు చేస్తుంటారు. ఇలాంటి అనధికార ట్యాపులు కమిషనర్ పర్యటనలో చాలా సార్లు బయటపడిన సందర్భాలు ఉన్నాయి.

ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణ లోపం

వాటర్ పంపింగ్ అత్యంత కీలకమైన అంశం. అటువంటి వాటర్ పంపింగ్ వ్యవస్థను పర్యవేక్షణకు ఏఈలు కీలకం. అయితే ఏఈలను వివిధ సర్వేల నిర్వహణపై పర్యవేక్షకులు ఉండటంతో ఇతర విధులు నిర్వహించడంతో పూర్తిగా వాటర్ పంపింగ్ వ్యవస్థ అంతా కింది స్థాయి సిబ్బంది కనుసన్నల్లో పనిచేస్తోంది. ధికారులు తాగునీటి పంపింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించి వేసవిలో తాగునీటి ఎద్దటి నుంచి శివారు కాలనీలను రక్షించాలని పలువురు కోరుతున్నారు.

డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా అడుగులు

గుంటూరు మెడికల్: గుంటూరు-1 ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గంజాయి, డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. అందులో భాగంగా గుంటూరు జీజీహెచ్‌లో మానసిక వ్యాధుల వైద్య విభాగంలో ఉన్న మద్యం, మాదక ద్రవ్యాల వ్యసన విముక్తి కేంద్రం (డి-అడిక్షన్ సెంటర్) ను అధికారులు సందర్శించి, అక్కడి వైద్యులతో మాట్లాడారు. డి-అడిక్షన్ సెంటర్‌లో వైద్యం చేయించుకుంటున్న రోగుల వివరాలు, డి-అడిక్షన్ అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలు, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేర్ కమిటీల గురించి చర్చించారు. గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్డు, రైల్వే గేటువద్ద, ఆటోనగర్ వద్ద గుంటూరు- విజయవాడ నేషనల్ హైవే సర్వీస్ రోడ్డు, నవోదయం 2.0 లో భాగంగా గంజాయి, డ్రగ్స్‌పై అవగాహన హోర్డింగులు ఏర్పాటు చేశారు. వసంత రాయపురంలో గంజాయి, డ్రగ్స్ పై అవగాహన సదస్సు నిర్వహించి ప్రజలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కె.రవి కుమార్ రెడ్డి, ఏఈఎస్ ఎ. సూర్య నారాయణ, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు ఎండీ కె.షరీఫ్, పి. తిరుమలేశ్వర రావు పాల్గొన్నారు.



డాక్టర్ వడ్డాది వెంకటకిరణ్‌తో మాట్లాడుతున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

సామాజిక స్ఫూర్తి నింపిన 'జై భీమ్ జనగానం'

నగరంపాలెం: స్థానిక మార్కెట్ కూడలిలోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జాషువా కల్చరల్ సెంటర్ ఆధ్వర్యంలో ఏపీ ప్రభుత్వ సృజనాత్మకత, సంస్కృతి సమితి భాషా సంస్కృతిక శాఖ సౌజన్యంతో జై భీమ్ జనగానం, అంబేడ్కర్ పాటల పండుగను శనివారం నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి సంస్కృతి వ్యవస్థాపకులు సర్రాజు బాలచందర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజా గాయకుడు పీవీ రమణ సారథ్యంలో బహుజన నాయకులు పల్లె నరసింహ, నూకతోటి శరత్ బాబు, ఆర్.రాజేష్, ఉదయభాస్కర్, లెనినా, సత్య జయరామ్, సోమన్న, కిన్నర్ యాదగిరి, అంజన్న, విప్లవకుమార్ పాటలు ఆలపించారు. సభికులను అలరించాయి. అనంతరం జయరాజ్, కె.దేవేందర్‌లను 'భీమ్ కళాజ్యోతి' పురస్కారాలతో సత్కరించారు. కార్యక్రమంలో వేమూరు, తాడికొండ ఎమ్మెల్యేలు నక్క ఆనందబాబు, తెనాలి శ్రావణ్‌కుమార్, జాషువా కల్చర్ సెంటర్ గౌరవాధ్యక్షులు బాలస్వామి, అధ్యక్షులు డాక్టర్ పోలే ముత్యం, మద్దిరాల మ్యాని, ఎస్‌జె.విద్యాసాగర్, నూతలపాటి కాళిదాసు, వినయ్‌కుమార్, గోళ్ళ అరుణ్ కుమార్ పాల్గొన్నారు.



జయరాజ్, కె.దేవేందర్‌లకు భీమ్ కళాజ్యోతి పురస్కారాలతో సత్కారం

క్రికెట్ విజేతలకు బహుమతులు ప్రదానం

గుంటూరు రూరల్: పరుచూరి వీరరాఘవులు సేవా సంఘం ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా నల్లపాడులోని రైల్వే గ్రౌండ్స్‌లో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ శనివారంతో ముగిసింది. కార్యక్రమంలో గుంటూరు వెస్ట్ ఎమ్మెల్యే గల్లా మాధవి పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పరుచూరి సంజీవరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో సాగర్ వారియర్స్ మొదటి స్థానం, జానీస్ లెవెన్ ద్వితీయ స్థానం, లోకల్ బాయ్స్ జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. ఈ సందర్భంగా విజేతలను అభినందించారు.

వక్ఫ్ చట్టంతో ముస్లింలకు న్యాయం

గుంటూరు మెడికల్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లుపై శనివారం గుంటూరులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతి రావు అధ్యక్షత హించారు. మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజీ మాట్లాడుతూ ప్రస్తుతం కొనసాగుతున్న చట్టంలో అనేక లోపాలు ఉన్నాయి కనుకనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వక్ఫ్ బోర్డ్ చట్ట సవరణ చేపట్టడం జరిగిందన్నారు. దీనివల్ల పేద, బలహీన వర్గాల వారికి అనేక లాభాలు చేకూరుతాయని పేర్కొన్నారు. మరో ముఖ్య అతిథి రవిచంద్ర రెడ్డి మాట్లాడారు. సమావేశంలో కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చరక కుమార్ గౌడ్, కో - కన్వీనర్స్ షేక్ అబ్దుల్ ఖుద్దూస్, షేక్ రఫీ, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నరేంద్ర షా, జిల్లా ప్రధాన కార్యదర్శులు షేక్ సాంబశివరావు, నాయకులు గౌస్ పీరా, షేక్ బిలాల్, షేక్ బాషా, షేక్ ఫర్హానా,మౌలాలి, బీజేపీ సీనియర్ నాయకులు కొక్కెర శ్రీనివాస్, యడ్లపాటి స్వరూప రాణి, ఈదర శ్రీనివాస రెడ్డి, పాలపాటి రవి కుమార్ పాల్గొన్నారు. తొలుత బీజేపీ జిల్లా కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజీ, నాయకులు రవి చంద్రారెడ్డి మాట్లాడారు. ముస్లింలకు న్యాయం చేయటం కోసమే వక్ఫ్ సవరణ బిల్లు తీసుకురావడం జరిగిందని బాజీ పేర్కొన్నారు.



మాట్లాడుతున్న షేక్ బాజీ

రేపటి నుంచి వేసవి శిక్షణ శిబిరం

గుంటూరు ఎడ్యుకేషన్: బృందావన్‌గార్డెన్స్‌లోని శాఖా గ్రంథాలయంలో ఈనెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారులు బి.శకుంతల, పి.సత్యశిరీష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజ్ఞాన శిబిరంలో భాగంగా కథలు వినడం, పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, చిత్రలేఖనం, పేపర్ క్రాఫ్ట్స్, డ్యాన్స్, క్విజ్, జనరల నాలెడ్జ్ అంశాల్లో తరగతులు నిర్వహించనున్నమని తెలిపారు. 40 రోజుల పాటు జరగనున్న శిక్షణ శిబిరానికి పిల్లలను పంపాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

కళాశాలల నిర్వాహకులపై చర్య తీసుకోవాలి



లక్ష్మీపురం: కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలలో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా కళాశాలలు నడిపేవారిపై చర్యలు తీసుకోవాలని ఆర్ఐఓ జుబేర్‌కు ఎస్ఎఫ్ఐ నాయకులు శనివారం వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ మాట్లాడుతూ ఏప్రిల్ 23న రాష్ట్ర ప్రభుత్వం కళాశాలలకు సెలవులు ప్రకటించిందన్నారు. కానీ కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కళాశాలలను నడుపుతూ ఎంతో మంది విద్యార్థులను మానసికంగా ఇబ్బంది పెడుతున్నారన్నారు. ఇప్పుడే సిలబస్ ప్రారంభిస్తామని, మీరు రాకపోతే మళ్లీ సిలబస్ బోధించమని, మార్కులు తగ్గుతాయని విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నారని చెప్పారు. ఇలాంటి ప్రైవేటు, కార్పొరేట్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్ఐఓను కలిసిన వారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు షేక్ సమీర్, నగర కార్యదర్శి యశ్వంత్, నగర ఉపాధ్యక్షులు సౌమ్య, సుభాని పాల్గొన్నారు.

పహల్గాం మృతులకు నివాళి

ప్రత్తిపాడు: పెహల్గాంలో ఉగ్రమూకల దాడిలో అసువులు బాసిన మృతులకు చిన్నారులు నివాళులర్పించారు. పెదనందిపాడులోని తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రం కన్వీనర్ దొప్పలపూడి రమేష్‌బాబు ఆధ్వర్యంలో శనివారం చిన్నారులు కొవ్వొత్తులు వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు.

టెన్త్ ప్రతిభావంతులకు అభినందన సభ

గుంటూరు ఎడ్యుకేషన్: ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన శ్రీసూర్యతేజ పబ్లిక్ స్కూల్ విద్యార్థులను పాఠశాల చైర్మన్ చింతల భానుప్రసాద్ అభినందించారు. శనివారం సంగడిగుంట రెడ్లబజారులోని పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో భానుప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థినులు మీర్జా సుమయ్య 585, ఆసిజ్ఞ 578, ఎ.వసంత 562, జి.గీతాసౌమ్య 558, షేక్ షబానా 550 మార్కులతోపాటు పరీక్షలు రాసిన 42 మంది విద్యార్థుల్లో 41 మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో అద్భుత ఫలితాలు సాధించినట్లు తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న భానుప్రసాద్

అహల్య ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



గుంటూరు మెడికల్: పేదలకు వైద్య సేవలు చేరువ చేయాలనే లక్ష్యంతో అహల్య ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని గుంటూరు అహల్య ట్రస్టు నిర్వాహకులు, సీనియర్ ఐవీఎఫ్ స్పెషలిస్టు డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్ అన్నారు. శనివారం ఫిరంగిపురం శాంతిపేట వేమన అపార్ట్‌మెంట్ ఎదురు అహల్య ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలువురు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శిరీష, డాక్టర్ సిరి పాల్గొన్నారు.

KANNA SCHOOLS REQUIRE
- Qualified Teachers to teach Lower/Higher Classes
- Experienced I.I.T/Computer Faculty
- Office Assistants/ Campus incharge(Female)
- Fluency in English is essential
- Salary Negotiable
- Send Resume to the whatsapp of 9440644248

Railpet ★ Valluivari Thota ★ R.T.C. Colony ★ Gunturuvari Thota ★ Old Guntur ★ Guntur.

WANTED
సెయింట్ జోసఫ్స్ హైస్కూల్ (CBSE)
పెదకాకాని, గుంటూరు
మా స్కూల్ నందు పనిచేయుటకు
❖ ఫిజిక్స్ ❖ కెమిస్ట్రీ
❖ ఇంగ్లీష్ ❖ సోషల్ స్టడీస్
బోధించుటకు అనుభవం కలిగిన B.Ed టీచర్లు కావలెను.
ఇంటర్వ్యూలు జరుగుచున్నవి.
సెల్ : 8985000039

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
(గుంటూరు వెస్ట్)
9912220356
Office mail : sakshigntadvt@gmail.com